వాసవీ మాత ఆలయానికి స్థలం కేటాయించాలి


మంత్రి కొండా సురేఖను కలిసిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

మణికొండ: వాసవీ మాత ఆలయ నిర్మాణానికి మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అనువైన స్థలం కేటాయించాలని వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మంత్రులను కోరారు. మంగళవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును వారు అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా తమ వాసవీ, ఆర్యవైశ్య సంఘాలన్నీ కలిసి ఆలయాన్ని నిర్మించుకుంటామని, ప్రభుత్వ పరంగా స్థలాన్ని కేటాయించాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రులు అనువైన స్థలాలను చూడాలని అధికారులను ఆదేశించినట్లు అధ్యక్షుడు తెలిపారు. అసోసియేషన్ నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం. జితేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మంత్రులను కలిశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

శంషాబాద్ రూరల్: పదో తరగతి వరకు కలిసి చదువుకున్న విద్యార్థులు, వారికి బోధించిన ఉపాధ్యాయులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. నర్కూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు బ్యూటీ గ్రీన్ రిసార్ట్‌లో మంగళవారం నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాటి హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు పుష్పలీల, ఉమామహేశ్వరి, బల్లెపు కుమార్, బి.దేవేందర్, పి.చంద్రశేఖర్, బి.ఈశ్వరయ్య పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ భూములను పరిరక్షిస్తాం


నిర్మాణాలను పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత

అత్తాపూర్: దేవాదాయ భూములను పరిరక్షిస్తామని రంగారెడ్డి జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత అన్నారు. మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి అత్తాపూర్ సీతారామ దేవాలయ భూములతో పాటు సర్వే నెంబర్ 384, 324లో ఉన్న ఆలయ భూములను పరిశీలించారు. ఇప్పటికే 384 సర్వే నెంబర్‌లో వనం శ్రీరామ్‌రెడ్డి, అనసూయ 250 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం చేయగా ఆలయం ముందు 60 గజాల స్థలంలో శివయ్య అనే వ్యక్తి నిర్మాణం చేశారు. అత్తాపూర్ ప్రధాన రహదారి మెఫిల్ హోటల్ సమీపంలో గోపాల్‌రెడ్డి విజయేందర్‌రెడ్డి ఏకంగా 1372 గజాల స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారు. కోట్లాది రూపాయలు విలువ కలిగిన దేవాదాయ శాఖ భూముల్లో నిర్మాణాలు చేపట్టిన వారిపై హైకోర్టులో కేసులు నడుస్తున్నాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిత, రాజేంద్రనగర్ సర్వేయర్ శ్రీనివాస్, దేవాదాయ శాఖ అధికారులు అంజయ్య, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై రైతులకు అవగాహన

శంషాబాద్: రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపాలిటీలోని హమీదుల్లానగర్‌లో రైతులకు శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందజేశారు. మంగళవారం రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో నేల ఆరోగ్య యజమాన్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.పవన్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ..భూసార పరీక్షల ఫలితాలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఎరువులు వాడే విధానాన్ని తెలిపారు. పంట మార్పిడి, నూతన వంగడాలు, చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. సూక్ష్మపోషకాల విభాగానానికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజమణి రైతులు తక్కువ యురియా, రసాయనాలు వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చిన్న గోల్కొండ పీఏసీఎస్ చైర్మన్ బొమ్మ దొనాకర్‌గౌడ్, మండల వ్యవసాయ అధికారి శ్వేత, ఏఈఓ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

- రామంజాపూర్ తండాలో అస్తవ్యస్తంగా నీటి సరఫరా
- మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్
- పాడైపోయిన బోరు మోటారు
- నీళ్ల కోసం గిరిజనుల అవస్థలు


రామంజాపూర్‌తండా అలంకారప్రాయంగా మారిన మినీ ట్యాంకు


బయటి ప్రాంతం నుంచి ప్లాస్టిక్ తొట్టిలో నీళ్లు ఎత్తుకొస్తున్న తండావాసి


రామంజాపూర్ తండాలో నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంకు

శంషాబాద్ రూరల్: ఓ వైపు ఎండలు మండుతున్నాయి..ఇదే సమయంలో తండాలో గిరిజనులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. అందుబాటులో ఉన్న బోరు పాడైపోవడంతో తండావాసులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రామంజాపూర్ అనుబంధ గ్రామం రామంజాపూర్ తండాలో 50 కుటుంబాలు నివసిస్తున్నాయి. తండాలో రెండు నెలల నుంచి నీటి సరఫరా సరిగా కావడంలేదు.

రెండు రోజులకోసారి..

తండాలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి నీటి సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ నీళ్ల రామంజాపూర్ వరకు చేరుకున్న తర్వాత.. అక్కడ సంపులో నిల్వ చేస్తారు. అక్కడి నుంచి సుమారు కిలో మీటరు దూరంలో ఉన్న తండాకు సంపు నుంచి పంపింగ్ చేసి ట్యాంకులోకి ఎక్కిస్తారు. అక్కడి నుంచి ఇంటింటికి నల్లా నీళ్ల సరఫరా అవుతాయి. అయితే రామంజాపూర్ వరకు భగీరథ నీళ్ల సరిగా రావడంలేదు. అరకొరగా సరఫరా అవుతున్న నీళ్లను అదే గ్రామంలో సరఫరా చేస్తున్నారు. దీంతో తండా వరకు నీటి సరఫరా కావడంలేదు. అరకొరగా వస్తున్న నీళ్లను రెండు రోజులకోసారి వదులుతున్నారు.

బోరు నీటి సరఫరా ఆగింది..

తండా శివారులో ఉన్న రేకుల కుంటలో బోరు నుంచి తండాకు నీటి సరఫరా చేస్తున్నారు. బోరు నుంచి నేరుగా తండాలో ఉన్న రెండు మినీ ట్యాంకులకు చేర్చి. అందులో నిల్వ చేస్తారు. అయితే నెల నుంచి ఈ బోరు మొరాయిస్తుండడంతో ఈ నీటి సరఫరా కూడా నిలిచిపోయింది. దీంతో రెండు మినీ ట్యాంకులు అలంకారప్రాయంగా మారాయి.

నీళ్ల కోసం పొలాల వెంబడి వెళ్తున్నాం..



ఇంట్లో బాత్రూం వెళ్లడానికి కూడా నీళ్లు ఉండడంలేవు. రెండు రోజులకోసారి వస్తున్న నీళ్లు.. రెండు బకెట్లు కూడా నిండడంలేదు. వ్యవసాయ కూలీ పనులు చేసుకునే మేము పొలాల నుంచి డబ్బాల్లో నీళ్ల తెచ్చుకుని అత్యవసర సమయాలకు వాడుకుంటున్నాం. నీళ్ల కోసం పొలాల వెంబడి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. – ముడావత్ చావ్లి, రామంజాపూర్ తండా

ట్యాంకు ద్వారా నీటి సరఫరా చేపడతాం..

తండాలో నీటి సమస్య ఉన్నది నిజమే. మిషన్ భగీరథ నీళ్ల సరిపడా రావడంలేదు. బోరు మోటారు తరచూ మొరాయిస్తుంది. రెండు సార్లు చెడిపోతే మరమ్మతులు చేయించాం. అయినా సమస్య పరిష్కారం కావడంలేదు. తండాలో నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం. అవసరమైతే ట్యాంకు ద్వారా నీటి సరఫరా చేపడతాం. – నాగరాజు, పంచాయతీ కార్యదర్శి

పశువులకు తాగునీరు లేకుండా పోయింది..



పశువులకు, జీవాలకు తాగునీరు దొరకడంలేదు. కుంటలోని బోరు నుంచి సరఫరా అయ్యే నీళ్ల నెల నుంచి రావడంలేదు. బోరు మరమ్మతులు చేయడంలేదు. ఇలాగే ఉంటే తండా వదిలి వెళ్లాల్సి వస్తుంది. – పాత్లావత్ దేస్యా, రామంజాపూర్ తండా

గ్రిడ్ నుంచి నీటి సరఫరాలో సమస్య..

మిషన్ భగీరథ నీటి సరఫరాలో గ్రిడ్ నుంచి సమస్య నెలకొంది. రామంజాపూర్ చివరి పాయింట్ కావడంతో నీళ్ల సరిగా రావడంలేదు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తండాకు నీటి సరఫరా చేసే బోరుకు ఫ్లషింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూస్తాం. – శివకుమార్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

వేసవి శిక్షణా శిబిరాలకు విశేష స్పందన


విద్యార్థులకు కూచిపూడి నేర్పిస్తున్న ఉపాధ్యాయులు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు వేసవి సెలవులలో తమకు నచ్చిన వాటిలో శిక్షణ తీసుకొని నైపుణ్యం పెంపొందించుకోవాలని గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, సైన్స్ ఉపాధ్యాయులు ఎస్.మాణిక్యంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యోగా, ధ్యానం, చిత్రలేఖనం, కథలు చెప్పడం, చదరంగం, ఇండోర్ గేమ్స్, టీఎల్‌ఎం తయారీ, ఆటలు, అభినయ గేయాలు, గ్రంథాలయ పుస్తకాలు చదవడం, నృత్యం, గణితంలో మెలకువలు, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యపు అలవాట్లు, అందమైన చేతిరాత తదితర వాటిపై శిక్షణ ఇస్తున్నామన్నారు. పాఠశాలలో ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఉచిత వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 19వ తేదీ వరకు శిక్షణా శిబిరాలు ఉంటాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయం రూ. 1.70 కోట్లు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీలో ఎల్‌ఆర్ ద్వారా ఇప్పటి వరకు సమకూరిన ఆదాయం రూ.1.70 కోట్లు మాత్రమే. ఎల్‌ఆర్‌ఎస్ కోసం మొత్తం 10,200 దరఖాస్తులు రాగా జీవో 111 కారణంగా పదివేలకు పైచిలుకు దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. పట్టణంలో కేవలం సాతంరాయి నుంచి వచ్చిన 150 దరఖాస్తులు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకోడానికి అనుకూలంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించడంతో అందులో ఇప్పటి వరకు 94 మంది మాత్రమే సంబంధిత రుసుమును చెల్లించి ప్రొసిడింగ్‌లను అందుకున్నారు. వీటి ద్వారా రూ.1.70 కోట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. శంషాబాద్ రెవెన్యూ పరిధిలో ఉండి సాతంరాయిగా పేరు పెట్టి దరఖాస్తు చేసుకోవడంతో కొందరి వద్ద సంబంధిత రుసుము స్వీకరించా అవి కూడా తిరస్కరణ గురయ్యాయి. సాతంరాయి రెవెన్యూకి సంబంధించిన దరఖాస్తులు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ పూర్తవుతున్నాయి.

రోడ్డు సమస్యకు పరిష్కారం


ప్రహరీని తొలగిస్తున్న హైడ్రా అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఉపయోగిస్తున్న రోడ్డుపై ప్రహరీని ఏర్పాటు చేసి రాకపోకలను ఇబ్బందులు సృష్టించాడు. పలు మార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. దీంతో స్థానిక ప్రజలు హైడ్రా కమిషనర్‌ను కలిసి తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. దీనికి స్పందించిన అధికారులు మంగళవారం ప్రజలకు ఇబ్బందిగా మారిన ఈ ప్రహరీని జేసీబీల సాయంతో నెలమట్టం చేశారు. వివరాల ప్రకారం..రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని ఇందిరా గాంధీ సొసైటీకి వెళ్లేందుకు ఒకటే రహదారి ఉంది. ఈ దారి తమది అని ఓ ప్రైవేటు వ్యక్తి ప్రజలు రాకపోకలు జరగకుండా ప్రహరీని ఏర్పాటు చేసుకున్నాడు. దీంతో ఇందిరాగాంధీ సొసైటీ సభ్యులు హైడ్రా కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం హైడ్రా సీఐ తిరుమలేష్ ఆధ్వర్యంలో ప్రహరీని నెలమట్టం చేశారు.

మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో అధికారులతో డీసీ సమావేశం


పారిశుద్ధ్య విభాగం జవాన్లు, సూపర్‌వైజర్లు, ఎస్‌ఎఫ్‌ఏలతో సమావేశమైన డీసీ రవి కుమార్


రాజేంద్రనగర్: మిస్ వరల్డ్ పోటీలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులు మంగళవారం సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్య విభాగం జవాన్లు, సూపర్‌వైజర్లు, ఎస్‌ఎఫ్‌ఏలతో కలిసి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశాన్ని ఉప కమిషనర్ డాక్టర్ రవి కుమార్, ఏఎంహెచ్‌ఓ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ..ప్రధాన రహదారిపై వాల్ పోస్టర్లు, బ్యానర్లను వెంటనే తొలగించాలని ఆదేశించినట్లు తెలిపారు. రహదారులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని సూచించామన్నారు. 24 గంటల పాటు సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టేలా విధులు అప్పగించామన్నారు. హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో సుందరీకరణ నేపథ్యంలో ఆరాంఘర్ చౌరస్తా, ఆరాంఘర్ అండర్ బ్రిడ్జితో పాటు పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే, కొత్తగా తొట్టిలు, మొక్కలను ఏర్పాటు చేశారని..వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించినట్లు వెల్లడించారు.

కార్మికుల సమ్మె నోటీసులు



నార్సింగి మున్సిపల్ మేనేజర్‌కు సమ్మె నోటీసు ఇచ్చిన కార్మికులు

మణికొండ: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలనే లక్ష్యంతో ఈనెల 20న నుంచి మున్సిపల్, వైద్య తదితర రంగాల కార్మికులు సమ్మెకు వెళ్తున్నారని, అందుకు అనుగుణంగా ఆయా శాఖల అధికారులకు నోటీసులు అందించామని సీఐటీయూ గండిపేట మండల కన్వీనర్ డి. ప్రవీణ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం నార్సింగి మున్సిపల్ మేనేజర్, మండల వైద్యాధికారులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల కాలాల పాటు పోరాటాలు చేసి కార్మికులు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. అవి అమలు జరిగితే రాబోయే రోజుల్లో కార్మిక సంఘాలు ఏర్పాటు చేసే అవకాశం ఉండదని, కార్మిక శాఖ నిర్వీర్యం అవుతుందన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, ఉపాధి లేకుండా పోతుందన్నారు. లేబర్ కోడ్స్‌ను అమలు చేయొద్దని, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కార్మికులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం


పిల్లర్ నంబర్ 195 వద్ద నిలిచిపోయిన వాహనాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి స్థానిక ప్రాంత ప్రజలు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గాలి, దుమారంతో రాత్రి 9 గంటల నుంచి కురిసిన భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే, పిల్లర్ నంబర్ 185, శివరాంపల్లి వాల్‌మార్ట్, ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి, గగన్‌పహాడ్ అండర్ గ్రౌండ్, రాజేంద్రనగర్ రేడియల్ రోడ్డు, గాంధీనగర్ ప్రధాన రహదారి, బుద్వేల్ కిష్టమ్మ గుట్ట రోడ్డుపై వరదనీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. జీహెచ్‌ఎంసీ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు వరదనీరు వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. దాదాపు 2 గంటల పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గాలి దుమారం కారణంగా చెట్టు కొమ్మలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం పడిన ప్రతిసారి పిల్లర్ నంబర్ 185 నుంచి 195 వరకు వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.


వరదనీరు వెళ్లేందుకు చర్యలు చేపడుతున్న సిబ్బంది

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త పవన్‌చంద్రారెడ్డి

శంషాబాద్ రూరల్: భూసార పరీక్షల ఆధారంగా పంటలకు తగిన మోతాదులో ఎరువులు వాడాలని నేల ఆరోగ్య యాజమాన్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.పవన్‌చంద్రారెడ్డి సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ వ్యవసాయ శాఖ సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా మంగళవారం హమీదుల్లానగర్ రైతు వేదిక ఆవరణలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వాతావరణ ఆధారిత సలహాలు, వేసవి దుక్కులు, సేంద్రీయ ఎరువుల వాడకంపై సూచనలు అందజేశారు. పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలను వివరించారు. పంటలకు ఎరువులుగా పచ్చిరొట్టే వాడే విధానాన్ని తెలియజేశారు. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, నూతన వంగడాలు, విత్తన శుద్ధి అంశాలపై అవగాహన కల్పించారు. సాగునీటి పద్ధతులు, తగిన మోతాదులో యూరియా, రసాయనాల వాడకంపై సూక్ష్మ పోషకాల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజమణి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నగోల్కొండ పీఏసీఎస్ చైర్మన్ బి.దొనాకర్‌గౌడ్, మండల వ్యవసాయాధికారి శ్వేత, ఏఈఓ రాఘవేందర్, రైతులు బాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ధనపాల్‌రెడ్డి, చంద్రయ్య, పాండు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో కష్టపడి పని చేసే వారికే పదవులు


పాండుయాదవ్‌ను సన్మానిస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: బీజేపీలో కష్టపడి పని చేసే వారికే పదవులు దక్కుతాయని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్–1 అధ్యక్షుడిగా గోదా పాండుయాదవ్, డివిజన్–2 అధ్యక్షుడిగా సురెడ్డి వినయ్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి బాగోగులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా గోదా పాండుయాదవ్ మాట్లాడుతూ..ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతతో పార్టీకి పని చేస్తూ ప్రజలకు అండగా ఉంటానన్నారు. సురెడ్డి వినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. ముందు నుంచి ఏబీవీపీలో అసెంబ్లీ కన్వీనర్‌గా, బీజేవైఎంలో అసెంబ్లీ కన్వీనర్‌గా పని చేశానన్నారు. డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అడికే జనార్దన్, రావుల భాస్కర్, సంతుగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, బబ్లు, బొమ్మరాజు నర్సింహ్మా, వి.లక్ష్మి, మధుసూధన్‌రెడ్డి, గోపాల్‌నాయక్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఎవరెస్ట్ పర్వతారోహణ బృందానికి సన్మానం


హిమాలయ పర్వత బేస్ క్యాంప్‌ను అధిరోహించిన సభ్యులు

మణికొండ: హిమాలయ పర్వత బేస్‌క్యాంప్ (5500 మీటర్ల ఎత్తు) ఎవరెస్ట్ అధిరోహికులకు ల్యాంకోహిల్స్ వాసులు మంగళవారం ఘనంగా సన్మానించారు. మణికొండ మున్సిపాలిటీ, ల్యాంకోహిల్స్ నివాసితులు 11 మంది మహిళలు, ముగ్గురు పురుషుల బృందం ఇటీవల బేస్ క్యాంప్‌ను అధిరోహించారు. దీంతో వారిని ల్యాంకో హిల్స్ లయన్స్ సభ్యులు మంగళవారం సన్మానించి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధిరోహికురాలు అనితారెడ్డి మాట్లాడుతూ..15శాతం చలిలో పైకి ఎక్కుతున్న కొద్ది ఆక్సిజన్ తగ్గుతుండటంతో ఎంతో ఇబ్బందికి గురయ్యామన్నారు. మరో అధిరోహికుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఆధునిక సౌకర్యాలతో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్న తాము అతి తక్కువ సౌకర్యాలతో ఎలా జీవించాలో నేర్చుకున్నానన్నారు. ల్యాంకో లయన్స్ ఫౌండర్ సభ్యుడు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ..ఎవరెస్ట్ బేస్ క్యాంప్ గమ్యాన్ని సురక్షితంగా చేరుకోవడం అభినందనీయమన్నారు. పర్వతారోహణ చేసిన రోహిణి, అరుణ, జ్యోతి, మధువన్ వారి అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు ఉమాపతి, గాంధీ, శ్రీనివాస్ సింగ్, బద్రి కిషోర్, వెంకటచలం, కిషోర్, శ్రీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు


మంచిరేవుల భూమి సర్వేలో పాల్గొన్న విద్యుత్, రెవెన్యూ అధికారులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా వస్తున్న గేటెడ్ కమ్యూనిటీలు, టవర్‌లు, నివాసాలకు అనుగుణంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లను పెంచి రాబోయే రోజుల్లో సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఇబ్రహీంబాగ్ ఏడీఈ అంబేద్రర్ అన్నారు. మంచిరేవుల రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 283లోని ఎకరం భూమిని ప్రభుత్వం విద్యుత్ సబ్‌స్టేషన్ గురించి ఇటీవల కేటాయించారు. దీంతో మంగళవారం దాన్ని సర్వే, పంచనామ నిర్వహించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్ విద్యుత్ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ..నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో వస్తున్న నిర్మాణాలకు అనుగుణంగా మరో నాలుగు సబ్‌స్టేషన్‌ల ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. అందుకు అనుగుణంగా పలు చోట్ల స్థలాలను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. వాటిని కేటాయిస్తే రాబోయే 20 ఏళ్ల వరకు విద్యుత్ సమస్యలు లేకుండా సబ్‌స్టేషన్‌లను నిర్మిస్తామన్నారు. మంచిరేవుల సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులను మొదలుపెడతామన్నారు. రెవెన్యూ, విద్యుత్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

23 నుంచి ప్రణవ భక్త సమాజం శత జయంత్యుత్సవాలు


మాట్లాడుతున్న నర్సింహ

అత్తాపూర్: హైదర్‌గూడ ప్రణవ భక్త సమాజం శత జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు సమాజం అధ్యక్షుడు మోంద్ర నర్సింహ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రణవ భక్త సమాజం ఆవిర్భావించి 105 ఏళ్లు పూర్తయ్యాయన్నారు. లోక కల్యాణం కోసం, దేశ భద్రత కోసం నిత్యం హోమాలు, వేదపండితులతో ఆధ్యాత్మిక కార్యక్రమాలను, ప్రత్యేక భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ ఉత్సవాలకు రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భజన మండలి ప్రతినిధులను, ప్రమిక పండితులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ నేతల సంబరాలు


మణికొండలో సంబరాలు చేసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు

మణికొండ: ఓబులాపురం మైనింగ్ కేసులో మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డికి సీబీఐ కోర్టు క్లీన్‌చిట్ ఇవ్వటంతో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని మర్రిచెట్టు సర్కిల్‌లో మంగళవారం రాత్రి బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టి ఆమెకు మద్దతుగా నినాదాలు ఇచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి. సీతారాం, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి జి. నరేందర్, నాయకులు ఎ. లక్ష్మణ్‌రావు, బి.శ్రీధర్, సుమనళిని, లక్ష్మయ్య, కిరణ్ పాల్గొన్నారు.

శంషాబాద్‌లో..

శంషాబాద్: ఎమ్మెల్యే సబితారెడ్డికి మైనింగ్‌కు సంబంధించిన కేసులో క్లీన్‌చిట్‌తో నిర్దోషిగా బయటపడడంతో బీఆర్‌ఎస్ నేతలు సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పట్టణ కూడలిలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు చక్రధర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు తదితరులున్నారు.

రాజేంద్రనగర్‌లో..

రాజేంద్రనగర్: ఓబులాపురం మైనింగ్ కేసులో మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డిని నిర్దోషిగా కోర్టు తీర్పు ఇవ్వడంతో మంగళవారం రాజేంద్రనగర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఓబులాపురం మైనింగ్ కేసులో నిర్దోషిగా కోర్టు తీర్పునివ్వడంతో ఆనందంగా ఉందన్నారు.